
భలే మ్యాజిక్: పెద్దాపురం కుమ్మరివీధిలో నీరు భూమిలో ఇంకిపోయేలా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌లో నీరు పోయించి పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

గోదారోళ్లు మనసున్న వ్యక్తులు..

అందరి కంటే మంచి మనసున్న వ్యక్తులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నారు. గోదావరి జిల్లా వాసుల మాట సౌమ్యంగా ఉంటుంది. ఇటువంటి ఈ జిల్లాలోనే గత పాలనలో రౌడీయిజం పెరిగిపోయింది. హత్యలు చేసే వారిని తూర్పుగోదావరి జిల్లాలోకి రానివ్వరు. కానీ గత వైసీపీ ఎన్నో అరాచకాలు చేసింది. అందుకే గోదావరి జిల్లాల వాళ్లు ఆ పార్టీనే దూరం పెట్టారు. కానీ ఇప్పుడు మేం వీటన్నింటిని సరిచేస్తున్నామన్నారు. పెద్దాపురంలో రూ.330 కోట్లతో చెత్త నుంచి విద్యుదుత్పత్తి తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. రెండేళ్లలో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ 18 నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించానని తెలిపారు. గోదావరి వరదలకు కోనసీమ జిల్లాలో లంక గ్రామాలు ముంపునకు గురైతే ఎప్పటికప్పుడు అందరిని అలెర్ట్ చేసి ప్రజలకు అండగా నిలిచామన్నారు. పెద్దాపురంలో రూ.38 కోట్లు, సామర్లకోటలో రూ.39కోట్ల అమృత్ నిధులతో ఇంటింటికి కుళాయి పథకాన్ని మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. రెండేళ్లల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.సామర్లకోటలో డిగ్రీ కళాశాల,పెద్దాపురంలో ప్రభుత్వాసుపత్రి ఇలా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప ఏది అడిగినా చేస్తాం.అడిగిన దాని కంటే ఎక్కువ చేస్తానన్నారు.



మీ ప్రాజెక్ట్ సూపర్




స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన తొమ్మిది స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రీసైక్లింగ్‌లో భాగంగా చేపడుతున్న ఉత్పత్తులపై ఆరా తీశారు. డ్రైవేస్ట్, ప్లాస్టిక్ వేస్ట్, మెటల్ వేస్ట్‌గా చెత్తను వేరుచేసేలా ప్రాజెక్ట్ రూపొం దించిన తొమ్మిదో తరగతి విద్యార్థులను మెచ్చుకున్నారు. సముద్రపు నాచుతో బయోడీజిల్,కాస్మొటిక్స్ వంటి ఉత్పత్తులు తయారు చేస్తున్న నిర్వాహకులతో ముచ్చటించారు. సముద్రపు నాచుతో మహిళలకు ఉపాధి కల్పించే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు సీఎం తెలి పారు. శ్రీకాకుళం జిల్లాలో సము ద్రపు నాచుతో ఉత్పత్తులపై శిక్షణ పొందిన మహిళలతో వర్చువల్‌గా మాట్లాడారు.

మొబైల్ మార్ట్.. సూపర్



జనచంద్రం: ప్రజా వేదిక సభకు హాజరైన జనం.. మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



స్వర్ణాంధ్ర చేస్తా!

పెద్దాపురంలో సీఎం చంద్రబాబు

- స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు
- బంగారు కుటుంబాలు పెరగాలి
- పారిశ్రామికవేత్తలకు పలు కుటుంబాలు దత్తత

(కాకినాడ,పెద్దాపురం-ఆంధ్రజ్యోతి)

స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర నా లక్ష్యం.. ఆ దిశగానే అడుగులు వేస్తున్నా.. పెద్ద పెద్ద ప్రారంభోత్సవాలు.. కార్యక్రమాల కోసం తాను పెద్దాపురానికి రాలేదని..ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పడానికి వచ్చానని..ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలన్నదే తన సంకల్పం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం సీఎం పర్య టించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోంది.. అప్పుడే ప్రతి కుటుంబం ఆనందంగా ఉంటుందని.. దీనిలో భాగంగానే ఏడు నెలలుగా ప్రతి మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర నిర్వహిసున్నామని తెలిపారు. అపరిశుభ్రత కారణంగా అంటువ్యాధులు వస్తాయని సీఎం వివరించారు. అక్టోబర్ 2వ తేదీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా చెత్త ఉండకూడదని ఆదేశించారు. డ్రోన్లు ఉపయోగించి దోమ ల నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వ అలక్ష్యంతో అంటువ్యాధులు ప్రబలాయన్నారు. పేదవారు ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో ప్రభు త్వం ఆధ్వర్యంలో ప్రైవేటు ఆసుపత్రులను పీపీపీ పద్ధతిలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. నా లక్ష్యం స్వర్ణ ఆంధ్ర కావాలంటే భవిష్యత్తులో ఏ పార్టీ వైపు చూడకుండా ఎన్‌డీఏ వైపు ప్రజలంతా ఉండాలని పిలుపునిచ్చారు.


పట్టాభి ఆగ్రో ఇండస్ట్రీస్ ఎండీ బీవీ.కృష్ణారావుకు బంగారు కుటుంబాన్ని దత్తత ఇస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు


మీ సేవలు భేష్: పారిశుధ్య కార్మికులకు మెమెంటోలు అందజేత

నా పేరు.. పవన్ పేరు చెప్పి బస్సెక్కండి!



టీడీపీ సూపర్‌సిక్స్ అంటే సాధ్యం కాదని చాలామంది అన్నారు.. కానీ ఇప్పుడు అమలు చేసి చూపెట్టాం. ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం అద్భుతంగా విజయవంతమైంది.. కాకినాడ, రాజమండ్రి వెళ్లాలంటే బస్సెక్కి తన పేరు..పవన్ పేరు చెప్పి జల్సాగా వెళ్లిపోవచ్చని సరదాగా వ్యాఖ్యానించా రు. అమ్మగారింటికి వెళ్లాలన్నా, తల్లిని పలకరించేందుకు వెళ్లడానికి ఇక ఇబ్బందే లేదని చమత్కరించారు.

బంగారు కుటుంబాలతో మాటామంతీ..



పాత పెద్దాపురం, సామర్లకోటకు చెందిన నందిక మార్త, యండ మూరి ఏసమ్మ, రాజారపు వీరలక్ష్మి, కడగాల గౌరి, కోసి ఉదయకుమారి, పలివెల లక్ష్మి, మాల్లాడి రాజేశ్వరి, మాటం సత్యవేణి, సరుకుల శ్రీదేవి, ఇజ్జిన స్వాతి కుటుం బాలతో చంద్రబాబు ముచ్చటిం చారు.ఇబ్బందులు తెలుసుకున్నారు. వీరిని దత్తత తీసుకున్న మార్గదర్శులైన లలిత ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్,పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ఎండీ బీవీ.కృష్ణారావు, శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్‌నున్న రామకృష్ణ, కొడవడి గాంధీ, అపర్ణ టైల్స్ హెచ్ఆర్ అజయ్‌కుమార్, వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ఎండీ వల్లూరి సూర్యప్రకాశరావు,దేవి సీఫుడ్స్ బ్రహ్మానందం, బ్లూ ఓషన్స్ ఎండీ రవికాంత్ తదితరులను సీఎం సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

ఉదయం 11.55 గంటలకు హెలికాప్టర్ దిగిన చంద్రబాబు తొలుత పెద్దాపురం పదో వార్డులో మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలించారు.ఆ తర్వాత పావు కిలోమీటరు మేర వైద్యులు, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛతా ర్యాలీ చేశారు. అనంతరం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో కలిసి బస్సులో 1.20 గంటలకు ప్రజా వేదిక వద్దకు చేరుకున్నారు. పెద్దాపురం మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. వీరి కోసం యాక్సిస్ బ్యాంకు ద్వారా బీమా పథకాన్ని ప్రారంభించారు. పెద్దాపురం మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వై.వీరవెంకట సత్యనారాయణ, ముత్య దుర్గను సీఎం చంద్రబాబు ఘనంగా సత్కరించారు. అలాగే యాక్సిస్ బ్యాంక్ ద్వారా ఇన్సూరెన్స్ పత్రాలను అందజేశారు. సాయంత్రం 5.22 గంటలకు అమరావతికి తిరుగుపయనమయ్యారు.


మీ కుటుంబాలకు నేనున్నా.


సీఎంకు ఆహ్వానం పలుకుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్


పెద్దాపురం పట్టణంలో సీఎంతో తన కుటుంబానికి సెల్ఫీ తీస్తున్న యువతి






సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ



సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

కలెక్టరేట్(కాకినాడ)/సామర్లకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో సీఎం చంద్రబాబుకు కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందుమాధవ్ ఘనస్వాగతం పలికారు. అమరావతి నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో ఆయన పెద్దాపురం రాగా, హెలీప్యాడ్‌వద్ద పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మున్సిపల్ మంత్రి పి.నారాయణ, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాసు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు, జేసీ రాహుల్‌మీనా, జిల్లా ప్రత్యేకాధికారి వీరపాండ్యన్, ప్రభుత్వ విప్ యనమల దివ్య, ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, వనమాడి కొండబాబు, జ్యోతుల నెహ్రూ, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ స్వాగతం పలికారు.


సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎంపీలు ఉదయ్, సతీష్



డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం 4
- ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి

సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు 5


మొక్క నాటుతున్న డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ

కొత్త ఎంపీడీవోలకు శిక్షణ

సామర్లకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను ప్రజలకు మరింత చేరువగా, పారదర్శకంగా మార్చాలన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషికి అనుగుణంగా ఉద్యోగులంతా కలిసి పనిచేయాలని ఉపముఖ్యమంత్రి ప్రత్యేకాధికారి(ఓఎస్‌డీ) కె.వెంకటకృష్ణ పిలుపునిచ్చారు. సామర్లకోట, బాపట్ల, శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణ కేంద్రాల్లో ప్రాథమిక శిక్షణ పొందుతున్న నూతన ఎంపీడీవోలతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి గ్రామాలు, మండలాల పాలనలో మార్పులు తీసుకురావడం ద్వారా ప్రజల అభివృద్ధి, ఉద్యోగ సంతృప్తి వస్తాయని సూచించారు. ఎంపీడీవోల శిక్షణను విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్స్ అధ్యాపకులను అభినందించారు. సామర్లకోట శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఉపప్రిన్సిపాల్ జి.రమణ, ఫ్యాకల్టీ శేషుబాబు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో నూతన ఎంపీడీవోలతో కలిసి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ వెంకటకృష్ణ శనివారం మొక్కలు నాటారు.

పకడ్బందీగా డీఎస్సీ అభ్యర్థుల

సర్టిఫికెట్ల పరిశీలన




గోదావరి జిల్లాల మెగా డీఎస్సీ మెరిట్‌లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ టీముల సభ్యులకు శిక్షణ ఇస్తున్న విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి

- వెరిఫికేషన్‌కు 25 టీంల ఏర్పాటు
- విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి

గొల్లప్రోలురూరల్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 నియామక ప్రక్రియకు సంబంధించి మెరిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు జి.నాగమణి సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మెరిట్ లిస్ట్‌లో 1241మంది అభ్యర్థులు ఉండగా వీరికి సర్టిఫికెట్లు పరిశీలన, తనిఖీ నిమిత్తం 25 బృందాలు ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో ఒక ఎంఈవో, డిప్యూటీ తహసీల్దారు, గెజిటెట్ హెచ్ఎం, ఎంఐఎస్ డేటా ఆపరేటర్లు ఉన్నారు. ఈబృందాల సభ్యులకు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి బృందం 50మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేయాల్సి ఉంటుందని ఆర్‌జేడీ తెలిపారు. వెరిఫికేషన్ అంతా ఆన్‌లైన్‌లో జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే అభ్యర్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను, వారివద్ద ఉన్న ఒరిజనల్ సర్టిఫికెట్లతో పరిశీలన చేయాలని సూచించారు. సోమవారం జరిగే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు తమతో మూడుసెట్లు అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, అకడమిక్, శిక్షణ, టెట్, కులధ్రువీకరణతోపాటు అన్ని సర్టిఫికెట్లు ఒరిజనల్స్ తెచ్చుకోవాలని వివరించారు. శిక్షణలో డీఈవో రమేష్, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల డీవైఈవోలు, అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రేపటినుంచి తెలుగు భాషా ఉత్సవాలు

కాకినాడ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాల్లో డాక్టర్ పి.చిరంజీవినీకుమారి స్మారక తెలుగు భాషా ఉత్సవాల్లో భాగంగా భాషాసాహిత్య పోటీలను ఈనెల 25నుంచి నిర్వహించనున్నామని కళాశాల కరస్పాండెంట్, కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్ తెలిపారు.రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని తెలుగు భాషా ఉత్సవాలు, భాషాసాహిత్య పోటీలను ప్రారంభించనున్నారన్నారు. 25న కథానికేతనం(తెలుగు కథల పోటీలు), 26న పద్యప్రౌఢి(తెలుగుపద్యాల ఆలాపన పోటీ), వాగ్ధార(ప్రసంగాల పోటీ), 28న తెలుగు వెలుగు(తెలుగు క్విజ్), 29న గాంధర్వం(తెలుగు జాతీయగేయాల పోటీలు) జరుగుతాయని తెలిపారు. వివరాలకు 8367671234 నెంబరులో సంప్రదించాలని సూచించారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా 29న నిర్వహించే బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ప్రత్యేకఅతిథిగా ప్రముఖ నవలా రచయిత రవి మంత్రి పాల్గొంటున్నారన్నారు.

ధవళేశ్వరంలో వరద తగ్గుముఖం 5

శాంతించిన శబరి 5

గణేష్ మండపాలకు..

అనుమతులు తప్పనిసరి

- ఎస్పీ బిందుమాధవ్

కాకినాడక్రైం,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాల నిర్వాహకులు మండపాల ఏర్పాటు, ఊరేగింపుల నిర్వహణ కోసం తప్పనిసరిగా పోలీసుల ముందస్తు అనుమతులు తీసుకోవాలని శనివారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎస్పీ జి.బిందుమాధవ్ సూచించారు.మండపాల ఏర్పాటుకు ఎవరికి ఎటువంటి చలానాలు చెల్లించనవసరం లేదని ఎస్పీ స్పష్టంచేశారు. అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం అనుసరించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే వ్యక్తులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి సింగిల్ విండో విధానంద్వారా https://ganeshutsav.net క్లిక్ చేసి అనుమతులు పొందాలన్నారు. ఈ విధానంతో గణేష్ ఉత్సవాలు నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి అనుమతులు సులభంగా పొందవచ్చన్నారు. https://ganeshutsav.net వెబ్‌సైట్ లోకి వెళ్లి న్యూఅప్లికేషన్ క్లిక్ చేయాలన్నారు. మొబైల్ నెంబర్ ఎంటర్ చేసి ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తయ్యాక దరఖాస్తు విండో ఓపెన్ అవుతుందన్నారు. దరఖాస్తు ఫారంలో దరఖాస్తుదారుడి పేరు, మొబైల్ నెంబర్, ఈమెయిల్ అడ్రస్, చిరునామా, అసోసియేషన్ లేదా కమిటీ పేరు పొందుపర్చాలన్నారు. గణేష్ మండపం స్థలం, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తుతోపాటు ఏ సబ్ డివిజన్, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో అప్లికేషన్‌లో తెలియచేయాలన్నారు. ముఖ్యంగా ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు, గణేష్ నిమజ్జనం తేదీ, సమయం, వాహన వివరాలు తెలియపర్చాలన్నారు. దరఖాస్తు సమర్పణ అనంతరం సంబంధిత పోలీసులు ఆ ప్రాంగణాన్ని పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారన్నారు.ఈనేపథ్యంలో వినాయక పందిళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల సూచనలను పాటించాలని ఎస్పీ బిందుమాధవ్ కోరారు.

సమగ్ర మార్పులే లక్ష్యంగా నూతన బార్ పాలసీ: శర్మ

రాజమహేంద్రవరం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): మద్యం నియంత్రణ, వ్యాపారంలో సమగ్ర మార్పులే లక్ష్యంగా ప్రభు త్వం నూతన బార్ పాలసీని అమల్లోకి తెచ్చిందని ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు,ఈఎస్‌లు, సీఐలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త బార్‌పాలసీ ప్రకారం రాష్ట్రంలోని 840 బార్‌ల్లో గీత కార్మికులకు 10శాతం కేటాయించామన్నారు. లైసెన్సు ఫీజులను 70నుంచి 50శాతానికి తగ్గించామని వాటిని 6వాయిదాల్లో చెల్లించవచ్చన్నారు. 26న సాయంత్రంలోపు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 28న కలెక్టర్ల సమక్షంలో లాటరీ నిర్వహించి 1 నుంచి కొత్త బార్‌లు అమల్లోకి తీసుకొస్తామని చెప్పారు.

ప్రజల ఆలోచనా విధానంలో మార్పురావాలి : స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం చంద్రబాబు

పెద్దాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర కల సాకారం కావాలంటే ప్రజలు తమ ఆలోచనా విధానంలో మార్పు రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఆయన శనివారం పాల్గొన్నారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి ఆయన రంగరాయ మెడికల్ కళాశాల విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ పాల్గొన్నారు. ఈర్యాలీ సుమారు 100 మీటర్ల పైబడి సాగింది. స్థానిక మిరపకాయవీధి రామాలయం వరకూ సాగింది. దారిలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర గురించి అవగాహన ఎంతమేర ఉందనే కోణంలో కళాశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సర్క్యులర్ ఎకానమీపై పాలసీ చేశామని, వాటివల్ల ఉపయోగాలపై మెడికల్ కళాశాల విద్యార్థులకు వివరించారు. అంటువ్యాధులు ప్రబలడానికి ప్రధాన కారణం చెత్తేనని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెత్తపై పన్ను వేశారన్నారు. దారిపొడవునా ప్రతీ ఒక్కరినీ పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ అవసరమైన చర్యలను చేపట్టాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే చెత్త సేకరించే విధానం కోసం వారితో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్త వాహనాన్ని తోసి కార్మికులను ఉత్సాహపరిచారు. అలాగే తడిపొడి చెత్త సేకరణను పరిశీలించారు. ర్యాలీలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రైన్‌ను పరిశీలించిన సీఎం

స్థానిక కుమ్మరి వీధిలో 95 అడుగుల పొడవుతో రూ.1.5 లక్షల వ్యయంతో నిర్మించిన మ్యాజిక్ డ్రైన్‌ను చంద్రబాబు పరిశీలించారు. అలాగే వాటివల్ల కలిగే ఉపయోగాలు, వాటి నిర్మాణం, వీటి ద్వారా కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసు కున్నారు. మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణం ద్వారా జల వనరులను కలు షితం చేయకుండా భూమి లోనే ఇంకిపోయేలా ఈ విధానం





ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

ఏపీ విధానాన్ని మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి

● ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విధానాన్ని దేశంలో మిగిలిన రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ప్రజావేదిక సభా ప్రాంగణంపై సీఎం చంద్రబాబు సమక్షంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛభారత్‌కు చంద్రబాబు కన్వీనర్‌గా ఉన్నారన్నారు. ప్రతీ శనివారం అధికారులు, పారిశుధ్య కార్మికులు ప్రతీ ఒక్కరూ హాజరై ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అలాగే చంద్రబాబు పేదరిక నిర్మూలనకు పీ4 అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చి ప్రతీ కుటుంబం బంగారు కుటుంబం కావాలన్నదే ఆయన సంకల్పం అన్నారు. పెద్దాపురంలో 2,500 కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. మార్గదర్శకులుగా పారిశ్రామికవేత్తల సహకారంతో పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు చెప్పారు. అలాగే పీ4 కార్యక్రమానికి సంబంధించి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఓ కార్యాలయాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. గోదావరి, ఏలేరు జలాలు రెండు మున్సిపాలిటీలకు ఇవ్వాలని కోరినట్టు చెప్పారు. అది కూడా నెరవేరిందన్నారు. 100 పడకల ఆసుపత్రిని అడిగినట్టు చెప్పారు. మెట్ట గ్రామాలకు మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సామర్లకోటకు డిగ్రీ కళాశాలను కోరుతున్నట్టు చెప్పారు.

పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి

పెద్దాపురం నియోజకవర్గానికి ఏదడిగినా చేస్తానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప 100 పడకల ఆసుపత్రి కావాలన్నారని, తప్పకుండా అది నెరవేరుతుందన్నారు. అలాగే సామర్లకోటలో డిగ్రీ కళాశాల, అమృత్ పథకం కింద నిధుల మంజూరు, 15 మెగావాట్ల సామర్థ్యంతో రూ.330 కోట్లతో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు, సామర్లకోటలో ఇంటింటికీ కొళాయికి రూ.75 కోట్లు ఖర్చు చేయనున్నట్టు చెప్పారు.





పెద్దాపురంలో పారిశుధ్య కార్మికుడితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పీ4 మార్గదర్శులు

బంగారు కుటుంబాలను సీఎం చంద్రబాబు సమక్షంలో దత్తత తీసుకుంటున్న లలితా ఇండస్ట్రీస్ ఎండీ మట్టే శ్రీనివాస్, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్



పెద్దాపురంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం, వైద్య విద్యార్థినులు

అప్పుడు బాగుందా.. ఇప్పుడా..

స్వచ్ఛతా ర్యాలీలో డాక్టర్లు, వైద్య విద్యార్థులతో సీఎం ముచ్చట్లు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

పెద్దాపురంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ర్యాలీలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. పురవీధుల్లో నడిచారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వైద్య విద్యార్థులు, డాక్టర్లతో ఆయన సరదాగా ముచ్చటించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న మార్పులను ఏం గమనించారు? అని అడిగి తెలుసుకున్నారు? సర్క్యులర్ ఎకానమీ పాలసీ తీసుకొచ్చామని చెబుతూ వాటి ఉపయోగాలను మెడికల్ విద్యార్థులకు వివరించారు. వారి మధ్య జరిగిన సంభాషణ వారి మాటల్లోనే..

సీఎం చంద్రబాబు: మీరంతా డాక్టర్సమ్మా? ఎక్కడ ఏ కాలేజ్ అమ్మా?

డాక్టర్: అవును సర్, రంగరాయ మెడికల్ కాలేజ్

సీఎం: సర్క్యులర్ ఎకానమీ స్టార్ట్ చేస్తున్నాం. వాట్ ఈజ్ యువర్ అండర్ స్టాండింగమ్మా?

డాక్టర్: హా.. ఈ వేస్ట్ అండ్ బయోమెడికల్. రీ సైక్లేషన్.. సర్..

సీఎం: ప్రతి ఒక్క దానికి వేస్ట్ నుంచి హౌ టు క్రియేట్ వెల్త్.. రీ సైక్లేషన్ అండ్ ఆల్ సో..

డాక్టర్: ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసి.. సమ్ అదర్ బెటర్ థేన్ యుటిలైజ్ చేయడానికి, వాటర్, ఎయిర్ పొల్యూషన్‌ను తగ్గించవచ్చు సర్..

సీఎం: దీనికోసం సర్క్యులర్ ఎకానమీ పాలసీ తీసుకొచ్చాం. ఏదీ కూడా వేస్టు కాదు. వేస్టు నుంచి కంపోస్టు గానీ, లేకపోతే ఎనర్జీగానీ ఆర్ రీయూజ్డ్‌గానీ, మళ్లీ బ్యాక్ టు....

డాక్టర్స్ : ఎస్.. సర్..

సీఎం: ఎంతమంది అమ్మా? మీ కాలేజీలో స్టూడెంట్స్?

డాక్టర్: 200 మెంబర్స్ బ్యాచ్..

సీఎం: ఏ ఇయరమ్మా మీరు?

డాక్టర్: 2017 బ్యాచ్ సర్.. మెడికల్ ఆఫీసర్స్‌గా పనిచేస్తున్నాం.

సీఎం: స్టాండర్డ్స్ బాగానే ఉన్నాయా.. లేదా తగ్గాయా..

డాక్టర్: బాగున్నాయ్ సార్ స్టాండర్డ్స్..

సీఎం: పాతకాలేజ్.. రంగరాయ మెడికల్ కాలేజ్ అంటే ఒక బ్రాండ్..

డాక్టర్: అవును సర్

సీఎం: పాత గవర్నమెంట్ చూశారు. ఇప్పుడు ఈ గవర్నమెంట్ చూస్తున్నారు. మీరు ఏమన్నా ఒక మార్పు చూస్తున్నారా?

డాక్టర్: సిస్టమ్‌లో చాలా మార్పులు వచ్చాయి సర్.. బేసికల్లీ సొసైటీలో మాకు రెస్పెక్ట్ పెరిగింది సర్.. యాజ్ ఏ డాక్టర్‌గా.. ఈ సాసా ప్రోగ్రామ్ వల్ల, వీటివల్ల ఏమవుతుందంటే.. పొల్యూషన్ లేకుండా ఎన్విరాన్‌మెంటల్ వెదర్ బోర్న్ డిసీజెస్ మలేరియా, డెంగీ కంట్రోల్ అయ్యాయి సర్..

సీఎం: మీకు విజిబుల్ కనిపిస్తోందమ్మా అది?

డాక్టర్: హాస్పిటల్స్, పీహెచ్‌సీలకు వచ్చే పేషంట్స్ బట్టి తెలుస్తుంది సర్..

సీఎం: కమ్యూనికల్ డిసీజెస్ కొంతవరకు ఏమైనా కంట్రోల్ అయ్యాయా?

డాక్టర్: ఎస్ సర్..

సీఎం: వాటర్ బోర్న్‌గానీ, వెదర్ బోర్న్‌గానీ కంట్రోల్ అవుతున్నాయా?

డాక్టర్: కంట్రోల్ అవుతున్నాయ్ సర్. ఇప్పటివరకు మా పీహెచ్‌సీలో మేము క్లీన్‌లీనెస్ అనేది చేసుకుంటాం సర్.. దట్ ఈజ్ అవర్ ప్రోగ్రామ్ టు రెస్పెక్ట్.. ఈ ప్రోగ్రాం వల్ల అందరికీ అవేర్‌నెస్ తీసుకొస్తున్నాం సర్..

ప్రభుత్వ పథకాల అమలులో కార్యకర్తలు కీలకం

సీఎం చంద్రబాబు





సామర్లకోటలో కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

సామర్లకోట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమం అమలులో పార్టీ కార్యకర్తలు కీలకం అయినందున అధికారులతోపాటు పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యకర్తలకు సూచిం చారు. శనివారం సాయం త్రం సామర్లకోట పూర్ణా కల్యాణ మండపంలో పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రతీ నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో కార్యకర్తలు పాల్గొని పారదర్శకత చూపాలన్నారు. ఈ-గవర్నెన్స్ క్వాంటమ్ మిషన్ వంటి పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కార్యకర్తలు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అంతకు ముందు ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో వినూత్నంగా ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం పేదప్రజల జీవితాల్లో వికాసం తెస్తుందన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో 2,500 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. మార్గదర్శకుల సహకారంతో ఆ కుటుంబాలను ఆదుకుంటామని సీఎం ఎదుట భరోసా ఇచ్చారు. సీఎం అందించిన ప్రోత్సాహంతో ఇప్పటివరకూ రూ.వెయ్యి కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు నిర్వహించగలిగానని, అలాగే గత 14 నెలల కూటమి ప్రభుత్వ హయాంలో రూ. 100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే చినరాజప్ప సీఎం చంద్రబాబుకు తెలియజేశారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రతో మంచి ఫలితాలు : పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్

పెద్దాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రతో మంచి ఫలితాల అందిస్తున్నట్టు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్ అన్నారు. సీఎం సమక్షంలో ప్రజావేదికపై ఆయన శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంతో జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడచిన 8 నెలలుగా ప్రజా భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2024నాటికి రాష్ట్రంలో 86 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ చెత్త పేరుకు పోయిందని, దీన్ని వచ్చే అక్టోబరు 2 నాటికి పూర్తిగా తొలగించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతోందని, సర్క్యులర్ ఎకానమీ ప్లాన్ కింద చెత్త నుంచి సంపద సృష్టించేందుకు మెగా ప్లాంట్‌లను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఇప్ప టికే విశాఖ, గుంటూరు ఈ ప్లాంట్‌లను ఏర్పాటుచేయగా, పెద్దాపురంలో ఏర్పాటుచేస్తున్నామన్నారు.

ట్రిపుల్ ధమాకా

● డీఎస్సీ ఫలితాల్లో టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత సాధించిన మణికంఠ చంద్రశేఖర్ ● రంపయర్రంపాలెం యువకుడికి మూడు విభాగాల్లోను ర్యాంకులు ● జిల్లాస్థాయిలో టీజీటీలో 15వ ర్యాంకు



ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్

గోకవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం రంప యర్రంపాలెం గ్రామానికి చెందిన ఉంగరాల మణికంఠ చంద్రశేఖర్ శనివారం విడుదలైన డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల పోస్టులకు అర్హత సాధించాడు. 2018లో జరిగిన డీఎస్సీలో మణికంఠ మొదటిసారి ప్రయత్నించి స్వల్ప తేడాతో అవకాశాన్ని కోల్పోవడం జరిగింది. కానీ పట్టువదలని విక్రమార్కుడిలా వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణపొంది 2025 డీఎస్సీలో టీజీటీ, ఎస్‌జీటీ, స్కూల్‌అసిస్టెంట్ మూడు విభాగాల ఉపాధ్యాయ ఉద్యోగాలకు పరీక్ష రాశారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో జిల్లా స్థాయిలో టీజీటీలో 15వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్‌లో 23వ ర్యాంకు, ఎస్‌జీటీలో 59వ ర్యాంకు సాధించి మూడింటిలోనూ ఉద్యోగానికి అర్హత సాధించారు. స్కూల్‌అసిస్టెంట్‌గా జడ్పీ ఉన్నతపాఠశాల గణితశాస్త్రం ఉపాధ్యాయుడిగా చేరతానని మణికంఠ తెలిపాడు. మణికంఠ తండ్రి గోకవ రంలో టైలర్ వృత్తి చేస్తుంటాడు.

డీఎస్సీలో అనూష, నాగేశ్వరరావు, శ్రీనివాస్ ప్రతిభ





నాగేశ్వరరావుకు 9వ ర్యాంకు, అనూషకు 69వ ర్యాంకు

కపిలేశ్వరపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం వడ్లమూరు గ్రామానికి చెందిన పాలింగి అనూష ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 86.39 మార్కులు సాధించి జిలాల్లో 69వ ర్యాంకు, ఎస్సీ క్యాటగిరీలో 5వ ర్యాంకు సాధించింది. నిరుపేద కుటుంబమైన పాలింగి శ్రీనివాస్, బేబి దంపతుల రెండవ కుమార్తె అనూష. వివాహిత అయిన ఈమె అత్తవారిల్లు కందులపాలెం. భర్త ఫోటో గ్రాఫర్, ఈమె 1 నుంచి 5 వరకు వడ్లమూరు ప్రాథమిక పాఠశాలలో, 6 నుంచి 10వరకు కాలేరు ఉన్నత పాఠశాలలో చదివింది. ఇంటర్మీడియట్ రామచంద్రాపురంలోను, డీఎడ్ బొమ్మూరు డైట్‌లో చదివి ఈ ర్యాంకు సాధించింది. అలాగే మాచరమట్ల గ్రామానికి చెందిన పిల్లి నాగేశ్వరరావు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)లో జిలాల్లో 9వ ర్యాంకు సాధించాడు. తండ్రి సత్యనారాయణ, దంపతులు వ్యవసాయ కూలీలు కాగా ఆకుటుంబంలో జన్మించిన నాగేశ్వరరావు జిల్లాస్థాయిలో 9వ ర్యాంకు సాధించినట్లు తెలిపాడు. వల్లూరు గ్రామానికి చెందిన సిద్ధాంతపు శ్రీనివాస్ 83 మార్కులతో పీఈటీగా సెలెక్ట్ అయ్యి జిల్లాస్థాయిలో 25వ ర్యాంకు, బీసీ-ఎలో 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి వ్యవసాయ కూలీకాగా శ్రీనివాస్ 1 నుంచి 5వరకు వల్లూరు మెయిన్ పాఠశాలలో 6 నుంచి 10వరకు వల్లూరు హైస్కూల్‌లో చదివాడు. పీఈటీ ట్రైనింగ్ గోపన్నపాలెం పశ్చిమగోదావరిజిల్లాలో చదివినట్లుతెలిపాడు.

డీఎస్సీలో బలరామపురం యువకుల ప్రతిభ



పైల శివకుమార్



దడాల దుర్గాప్రసాద్

రౌతులపూడి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదలచేసిన ఉపాధ్యాయుల నియామకాల్లో బలరామపురం గ్రామానికి చెందిన పైల శివకుమార్, దడాల దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచారు. పైల శివకుమార్‌కు ఫిజికల్ సైన్స్‌లో రాష్టంలో ఆరో ర్యాంక్ రాగా, జోన్ రెండోస్థానంలో నిలిచాడు. డీజీటీ సైన్స్‌లో రాష్టంలో ఐదో స్థానం, జోన్ మొదటి స్థానంలో, టీజీటీ ఫిజికల్ సైన్స్ జోన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇప్పటికే సెంట్రల్లో రాస్టిరియా మిలటరీలో ఉద్యోగం సాధించాడు. దండాల దుర్గాప్రసాద్ టీజీటీ హిందీర్యాంక్ 8 సాధించాడు.

డీఎస్సీలో గాయత్రికి జిల్లాలో 3వ ర్యాంకు



తోలేటి గాయత్రి

సీతానగరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా సీతానగరం మండలంలోని లంకూరుకు చెందిన తోలేటి గాయత్రి ఏపీ మెగా డీఎస్సీలో సెకండ్‌గ్రేడ్ టీచర్ పోస్టుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. గాయత్రి జీవనపోరాటంలో అనేక కష్టాలను అధిగమించారు. రైతు కుటుంబానికి చెందిన గాయత్రి 2003లో పదో తరగతి పూర్తిచేసి తర్వాత కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో విద్య ఆగిపోయి వివాహం చేసుకున్నారు. 2012లో భర్తను కోల్పోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. తనలోని ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మళ్లీ చదువు ప్రారంభించారు. తన చిన్ననాటి కల అయిన టీచర్ అవ్వాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ ఇంటర్ పూర్తిచేశారు. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును విజయవంతంగా పూర్తిచేశారు. ఎటువంటి కోచింగ్ సెంటర్ సహాయం లేకుండా స్వయం కృషితో డీ ఎస్సీలో 93.5శాతం మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. తన విజయానికి ప్రేరణ ఇచ్చిన తాతయ్య చేకూరి అరవాలురాజు, తల్లిదండ్రులు తోలేటి సూర్యనారాయణ, నాగమణి ఇద్దరు సోదరులు ఉపాధ్యాయులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

డీఎస్సీలో వీరవేణికి 19వ ర్యాంక్



ఉందుర్తి వీరవేణి

కరప, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కరప గ్రామంలో నివాసముంటున్న ఉందుర్తి వీరవేణి డీఎస్సీ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా స్థాయిలో 19వ ర్యాంక్ సాధించారు. అంబేడ్కర్ కోనసీమజిల్లా రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన ఈమె బీఎస్సీ (బీఈడ్) చదివి ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఎఫ్‌ఎన్‌వోగా పనిచేస్తున్నారు. గత నాలుగేళ్లుగా ఆమె కరపలో ఉంటూ ఒకపక్క ఉద్యోగం చేస్తూ మరోపక్క డీఎస్సీకి నిర్విరామంగా చదివి రెండో ప్రయత్నంలో ఓపెన్ కేటగిరీలో ఈర్యాంక్ సాధించారు. బయోలాజికల్ సైన్స్ విభాగంలో స్కూల్‌అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. ఆమె భర్త భరత్‌కుమార్ పాత్రికేయుడిగా పనిచేస్తుండగా, కుమారుడు డిప్లొమో, కుమార్తె ఇంటర్‌చదువుతున్నారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ)/రాజానగరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఎస్సీ మహిళలకు, పురుషులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో జిల్లాకు ఐదుగురు పురుషులకు, ఐదుగురు స్త్రీలకు, మొత్తం 30 మందికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (హెచ్‌ఎంవీ) ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి తెలిపారు. వయస్సు 20 సంవత్సరాల పైబడిన, ఆసక్తిగల షెడ్యూల్డు కులాలు అభ్యర్థులు, కనీసం ఒక సం1వత్సరం కాలపరిమితిగల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ (ఎల్‌ఎంవీ) లైసెన్స్ కలిగి ఉన్న పురుషులు, స్త్రీలు ఈనెల 27న సాయంత్రం ఐదు గంటలలోపు కాకినాడ ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఈడీ తెలిపారు. వివరాలకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ కె.నందేశ్ సెల్ నెం.7671949476 సంప్రదించాలని తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, దర్శనం కోసం బారులుతీరిన భక్తజనం

వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.60.16 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొ క్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.60.16లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

తొలితిరుపతికి భక్తుల రద్దీ

పెద్దాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,33, 380, అన్నదాన విరాళాలు రూ.64,368 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.1800, ప్రసాద విక్రయం ద్వారా 15,990, తులాభారం ద్వారా రూ.50, కానుకలద్వారా రూ.111 వెరసి రూ. 2,15,699 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు ఐదువేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.



శృంగారవల్లభస్వామి

శివాంజనేయ నర్సరీని సందర్శించిన

హైకోర్టు జడ్జి కిరణ్మయి

కడియం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కిరణ్మయి శనివారం కడియపులంక మల్లు పోలరాజు-శివాంజనేయ నర్సరీని సందర్శించారు. ఆమెకు నర్సరీ రైతు పోలరాజు మొక్కను అందజేసి స్వాగతించారు. కిరణ్మయి నర్సరీలో వివిధ రకాల మొక్కలు చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడియం నర్సరీల గురించి తాను విన్నానని, ఇక్కడ ఎయిర్ ప్యూరిఫైర్, ఆర్కిడ్స్ తదితర ఎటువంటి మొక్కలైనా అందుబాటులో ఉంటాయని, తమకు కావాల్సిన కొన్నిరకాల మొక్కలు కొనుగోలు చేసేందుకు వచ్చామని తెలిపారు. మట్టి లేకుండా గాలిలో తేమను మాత్రమే తీసుకుని పూలను వికసిస్తున్న మొక్కలు తనను ఆకర్షించాయన్నారు. 20నుంచి 40 ఏళ్లనాటి విదేశీ బొన్సాయ్ మొక్కలు పదుల సంఖ్యలో ఉండడం విశేష మన్నారు. కార్యక్రమంలో నర్సరీ రైతు మల్లు శివ, తదితరులు ఉన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న జస్టిస్ కిరణ్మయి

ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్‌కు

రూ.88 కోట్లతో డీపీఆర్ సిద్ధం

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



రూ.88 కోట్ల డీపీఆర్‌ను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి అందజేస్తున్న టూరిజం అధికారులు

బిక్కవోలు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన బిక్కవోలులోని శ్రీలక్ష్మీగణపతి, శ్రీగోలింగేశ్వర, శ్రీకుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలతోపాటు గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయాలను ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్ పేరుతో అభివృద్ధి చేసేందుకు రూ.88 కోట్లతో టూరిజం శాఖాధికారులు డీపీఆర్ సిద్ధం చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రాజమహేంద్రవరంలో శనివారం టూరిజం శాఖ అధికారులు ఎమ్మెల్యేను కలసి ఈ మూడు ఆలయాలను కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గంజేంద్రసింగ్ షెకావత్ ఆదేశాలతో రాష్ట్ర పర్యాటకశాఖ రూపొందించినట్లు టూరిజం ఈఈ విజయభాస్కరరెడ్డి, కన్సల్టెంట్ పావని, వినోద్ వివరించి డీపీఆర్‌ను అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే ఈమూడు ఆలయాలను అభివృద్ధి చేయడం కోసం డీపీఆర్‌ను పరిశీలించి దానిలో మార్పులు, చేర్పులు చేసి రాష్ట్ర టూరిజంశాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తుది నివేదిక అందిస్తామని తెలిపారు.

- తేరుకుంటున్న గ్రామాలు
- కోనసీమ జిల్లాలో 4527 మంది నిరాశ్రయులు
- కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రకటన

నిలకడగా గోదావరి వరద


అమలాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి శాంతిస్తుంది. శనివారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ దగ్గర ఉదయం రెండో ప్రమాద హెచ్చరికను, రాత్రి 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసహరించుకుంటున్నట్టు ఇరిగేషన్ అధికారి ప్రకటించారు. దాంతో 9.85 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదలడంతో కోనసీమలోని గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమి నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా జిల్లాలో పలు కాజ్‌వేలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి. పలు లంక గ్రామాలకు వరద ఉధృతి వల్ల రవాణా సౌకర్యాలు స్తంభించి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాకలిపాలెం, మూలస్థానం, అప్పనపల్లి, ఎదురుబిడియం కాజ్‌వేలలో శనివారం రాత్రికి వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి జిల్లాలో కాజ్‌వేలతో పాటు లంక గ్రామాలు వరద నీటి నుంచి బయట పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో జరిగిన పంటలు, ఇతర నష్టాలపై అధికారులు ప్రత్యేక బృందాలతో అంచనాలు సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు.

7 పునరావస కేంద్రాల ఏర్పాటు

గోదావరి వరదల కారణంగా కోనసీమ జిల్లాలో 1291 కుటుంబాల వారు ముంపు బారిన పడి 4527 మంది నిరాశ్రయులయ్యారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వరద ఉధృతి తగ్గుముఖం పట్టినట్టు వెల్లడించారు. ఇప్పటివరకూ 3 కుటుంబాల్లో 10 మందిని సురక్షిత కేంద్రాలకు తరలించామని, బాధితుల కోసం 7 పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 1098 గృహాలు ముంపు బారిన పడాయి. బాధితుల తరలింపునకు 23 బోట్లు సిద్ధం చేసి 283 మందికి సహాయక చర్యలు చేపట్టాం. 400 ఆహార పొట్లాలు 810 టిన్నెలు వాటర్ సప్లై చేసినట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో బోడసుకుర్రు పల్లిపాలెం, లంక ఆఫ్ ఠాణేలంక, పాశర్లపూడి లంక, చింతపల్లిలంక, కూనలంక, గుర్రుజాపులంక, లక్ష్మీదేవిలంక, గోడిలంక, కొండుకుదురు గ్రామాలు ముంపు బారిన పడినట్టు చెప్పారు.



ఆలమూరు మండలం జొన్నాడ పుష్కర్‌ఘాట్ వద్ద వరద ప్రవాహం







పి.గన్నవరం మండలం గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున జలదిగ్బంధంలో అరటితోట, మామిడికుదురు మండలం పాశర్లపూడి శ్రీరామ్‌పేటలో వరదనీరు, కోటిపల్లి పుష్కరాల రేవులో తగ్గిన గోదావరి వరద ప్రవాహం



పి.గన్నవరం: గంటిపెదపూడి వద్ద బూరుగులంక నదిపాయలో పడవ ప్రయాణం

శాంతించిన శబరి



చింతూరు - కుయుగూరు నడుమ జాతీయ రహదారిపై ప్రారంభమైన రాకపోకలు

చింతూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆరురోజుల పాటు ఉధృతంగా ప్రవహించిన శబరి నది శనివారం ఉదయం నుంచి తగ్గడం ప్రారంభించింది. దీంతో లోతట్టు వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిస్సాకు వెళ్లే 30వ నంబరు జాతీయ రహదారిపై వరదనీరు తగ్గడంతో రాకపోకలు పునరావృతమయ్యాయి. కాగా సోకిలేరు వాగుపై ఇంకా వరద నీరు ఉండడంతో చింతూరు - వరరామచంద్రపురం నడుమ శనివారం కూడా రాకపోకలు సాగడం లేదు.

ధవళేశ్వరంలో వరద ఉధృతి తగ్గుముఖం

- ప్రమాద హెచ్చరికలు ఉపసంహరణ
- వేగంగా తగ్గుతున్న నీటి మట్టం

ధవళేశ్వరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతుంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి 14.30 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం శుక్రవారం సాయంత్రం నుంచి తగ్గుతూ శనివారం తెల్లవారుజామున 2గంటలకు 13.70 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. ఆపై వేగంగా తగ్గుతున్న నీటి మట్టం 17గంటల వ్యవధిలో శనివారం రాత్రి 7గంటలకు 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 10,04,000వేల క్యూసెక్కులు దిగువకు వదిలారు. రాత్రి 8గంటలకు నీటి మట్టం 11.50 అడుగులకు చేరుకోగా 9,57,297 క్యూ సెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ఎగువన అన్నిప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుతోంది. భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటి మట్టం శనివారం రాత్రి 8గంటలకు 36 అడుగులకు చేరుకుంది.



కాటన్ బ్యారేజ్ దిగువున వరద ప్రవాహం

లారీ ఢీకొని సర్పంచ్ మృతి





సర్పంచ్ బుల్లారావు (ఫైల్), ప్రమాదానికి కారణమైన లారీ

రామన్నపాలెంలో విషాదఛాయలు

దేవరపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌ను టిప్పర్ లారీ వేగంగా ఢీకొనడంతో ఓ గ్రామ సర్పంచ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం రామన్నపాలెం గ్రామ సర్పంచ్ కూచిపూడి బుల్లారావు (71) శనివారం దేవరపల్లి పెట్రోల్ బంక్‌కు వెళ్లడానికి వస్తుండగా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లికి చెందిన టిప్పర్ లారీ దుద్దుకూరు మెటల్ కోసం వెళ్తోంది. ఈ క్రమంలో దేవరపల్లి పెట్రోల్‌బంకు వద్ద ఎదురుగా వెళ్తున్న మోటర్‌సైకిల్‌ను టిప్పర్ లారీ వేగంగా ఢీకొని సుమారు 20గజాల దూరం ఈడ్చుకుని వెళ్లిపోయింది. దీంతో బుల్లారావు ముఖభాగమంతా నుజ్జునుజ్జుఅయ్యింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ విజయ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుల్లారావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కూచిపూడి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శవపంచనామా అనంతరం స్వగ్రామం రామన్నపాలెం తరలించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.బుల్లారావు పార్థివదేహానికి మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, ఎంపీపీ కేవీకే దుర్గారావు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అయితే లారీకి ముందు భాగంలో సగభాగం అద్దానికి స్టిక్కర్లు, బొమ్మలతో అలంకరించడంతో ఎవరు వెళ్తున్నది సరిగా కనిపించకుండా ఉండే విధంగా ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ఠాణేలంక మొల్లిలో చోరీ

- ఇంట్లో వెండి, బంగారం వస్తువులు మాయం

ముమ్మిడివరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ ఠాణేలంక మొల్లిలో ఇంట్లో దొంగలు పడి వెండి, బంగారం వస్తువులను చోరీ చేశారు. ఠాణేలంక మొల్లికి చెందిన సానబోయిన వెంకటసత్యనారాయణ గురువారం కుటుంబసభ్యులతో కలిసి కర్ణాటక తీర్థయాత్రలకు వెళ్లాడు. అయితే ఇంటికి పాలు తీసుకుని వచ్చే వ్యక్తి శుక్రవారం యథావిధిగా పాలు తీసుకొచ్చి ఇంటి వద్ద పెట్టి వెళ్లిపోయాడు. శనివారం కూడా పాలు తీసుకొచ్చి పెట్టగా ముందురోజున పెట్టిన పాలు అలాగే ఉండడంతో ఇంట్లోకి చూడగా తలుపులు పెకిలించి ఉండడాన్ని గమనించాడు. వెంటనే విషయాన్ని సత్యనారాయణకు ఫోన్‌లో తెలుపగా తాను తీర్థ యాత్రలకు వెళ్లానని చెప్పడంతో ఆ విషయాన్ని బంధువులకు తెలపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో బీరువాలో భద్రపరిచిన 49 తులాల వెండి, నాలుగు బంగారపు రూపులు, రూ.2వేల నగదును దొంగిలించుకుపోయినట్టు సమాచారం. దుండగులు తలుపులు పెకిలించి ఇంటి బీరువాను బద్దలు గొట్టి వస్తువులు, నగదు దొంగిలింకుపోయారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీం బృందం అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు.



బీరువాలో చెల్లాచెదురుగా ఉన్న వస్తువులు



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

రాచపల్లిలో మహాకుంభాభిషేకం



నాయినార్ల విగ్రహాలకు అభిషేక జలాలు తీసుకొస్తున్న దృశ్యం



నాయినార్లకు పల్లకీ సేవ

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో శనివారం నాయినార్ల మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వరుని ఆలయ ప్రాంగణంలో 63మంది నాయినార్ల విగ్రహాలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా అభిషేకాలు చేపట్టారు. విగ్రహాలకు ఆలయ వ్యవస్థాపకులు రామానంద స్వామి, నాయినార్ల చరిత్రకారిణి అరుణాచల మాధవి ఆధ్వర్యంలో మహామండలాభిషేకాలు నిర్వహించారు. 63 మంది నాయినార్లతో పాటు దక్షిణామూర్తి, శ్రీ లక్ష్మీ హైయిగ్రీవ సూర్యభగవాన్, కాళభైరవ, భరతమాత, గంగామాతలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తమిళనాడు నుంచి విచ్చేసిన వాయిద్య విద్యాంసుల మంగళవాయిద్యాల మధ్య 63 మంది నాయినార్లకు పల్లకీ సేవ నిర్వహించారు.



బండి.. జాగ్రత్తండి..

కాకినాడలో మోటార్ తొట్టి రిక్షాపై ఓ వ్యక్తి వాహనదారులను తీసుకెళ్తూ ఇలా కనిపించాడు. లోడు తీసుకెళ్లే బండిపై ప్రయాణికులంటే జాగ్రత్త పడాల్సిందే.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

వీఆర్వో ఆకస్మిక మృతి



అనోజ్‌కుమార్ (ఫైల్)

కూనవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలం మర్రిగూడెం పంచాయతీకి చెందిన వీఆర్వో పి. అనోజ్‌కుమార్ ఆకస్మికంగా మృతి చెందారు. అనోజ్‌కుమార్ కూనవరానికి గోదావరి అవతలి ఒడ్డున ఉన్న ఏలూరు జిల్లా వేలేరుపాడు నుంచి విధులకు రాకపోకలు సాగిస్తూ ఉండేవారు. 2 రోజులుగా గోదావరి వరద ఉధృతం కావడంతో పడక రాకపోకలు నిలిచిపోయాలు. దీంతో అనోజ్ కుమార్ చూచురేవుల సచివాలయం కార్యాలయంలో ఉండి విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో ఒంటరిగానే నిద్రపోయేవారు. అయితే శనివారం ఉదయం సచివాలయం సిబ్బంది కార్యాలయానికి వెళ్లి చూడగా అనోజ్ కుమార్ పడిపోయి ఉన్నారు. దీంతో సచివాలయ సిబ్బంది కోతులగుట్ట ఆసుపత్రికి ఆటోలో తరలించగా అనోజ్‌కుమార్ మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు. వీఆర్వో 2 రోజులుగా జ్వరంతో బాధపడుతున్నట్టు తెలిసింది. ఫిట్స్ కారణంగా మృతి చెందిఉంటాడని డాక్టర్లు చెప్తున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు



రవాణాశాఖ ప్రిన్స్‌పాల్ సెక్రటరీకి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఈవో



సత్యదేవుడి దర్శనానంతరం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమలత

అన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం పలువురు ప్రముఖులు స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. వారిలో రవాణాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి, చిల్లకూరు సుమలత కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ స్వామిని దర్శించిన వారిలో ఉన్నారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన కేవిపి బాపన్న రూ.1,00,116 విరాళం ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. ఆయన దాతను అభినందించారు.



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అన్నవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం దేవస్థానంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నక్షత్రవనం, సత్యగిరి ప్రాంగణాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ గుర్రాజు, యనమల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా అన్నవరంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈవో సుబ్బారావు

లారీ ఢీకొని ఆర్ఎంపీ మృతి

పశ్చిమగోనగూడెం వద్ద ఘటన

కోరుకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఆర్ఎంపీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు యేగి ప్రేమ్‌కుమార్(44) మోటార్‌సైకిల్‌పై కోరుకొండ బయలుదేరాడు. మార్గమధ్యంలో కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెం సింహపురి లే అవుట్ వద్దకు వచ్చేసరికి ఓ లారీ అతి వేగంగా వచ్చి ప్రేమ్‌కుమార్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా పూర్తి చేశారు.

బైక్ ఢీకొని లారీ క్లీనర్ మృతి

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన క్లీనర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అన్నవరం వైపు నుంచి రాజమండ్రి వెళ్తున్న లారీ శుక్రవారం రాత్రి స్థానిక ధర్మవరం హైవేపై ఉన్న పెట్రోల్ బంక్ వద్ద నిలిపి క్లీనర్ పఠాన్ సుభాన హైవే రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన మోటార్ బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సుభానును స్థానిక ఆసుపత్రికి తరలించగా అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిది గుంటూరు జిల్లా తెనాలి మండలం కాతేవరం గ్రామంగా పోలీసులు గుర్తించారు. శనివారం మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు.

రేపు జాబ్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):అశోక్ లేలాండ్, టీలీస్ సర్వీసెస్, పేటీఎం, సోషల్ సిస్టం ఇండియా, క్రెడిట్ అసోసియేషన్ గ్రామీణ్ సంస్థల్లో పనిచేయడానికి ఈనెల 25న ఉదయం 10.00గంటల నుంచి కాకినాడజిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 8639846568లో సంప్రదించాలన్నారు.

ఇన్‌చార్జ్‌ను నియమిస్తారా లేదా..!

• వేళంగి అత్యవసర సమావేశంలో టీడీపీ కార్యకర్తల అల్టిమేటం



కాకినాడరూరల్ టీడీపీ ఇన్‌చార్జ్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

కరప, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 2019 నుంచి కాకినాడరూరల్ నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జ్ లేక పలు ఇబ్బందులకు గురవుతున్నామని, అధిష్టానం వెంటనే స్పందించి ఇన్‌చార్జ్‌ను నియమించాలని లేనిపక్షంలో ఎవరిదారి వారు చూసుకుంటామని టీడీపీ కార్యకర్తలు అల్టిమేటం జారీ చేశారు. కరప మండలం వేళంగిలోని టీడీపీ సీనియర్ నేత చుండ్రు వెంకన్నరాయచౌదరి స్వగృహంలో శనివారం సాయంత్రం మండలంలోని 23 గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు కలిసి అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. గత ఆరేళ్లుగా ఇన్‌చార్జ్ లేకపోయినా సంఘటితంగా ఉంటూ అధిష్టానం ఆదేశాల మేరకు గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై ఎప్పటికప్పుడు పార్టీపరంగా పోరాడామన్నారు. గత ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని పాటించి జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ గెలుపునకు కృషిచేశామన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా మండలంలో పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని, కూటమి ప్రభుత్వంలో తమకు సరైన గుర్తింపు, గౌరవం దక్కడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీకి కంచుకోటగా నిలిచే కాకినాడరూరల్ నియోజకవర్గానికి ఇన్‌చార్జ్ లేక కార్యకర్తలకు న్యాయం జరగడం లేదని, మేమంటే మేము ఇన్‌చార్జ్‌లమంటూ ఐదారుగురు నాయకులు పెత్తనం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ పెద్దలు తక్షణం స్పందించి ఇన్‌చార్జ్‌ను నియమించాలని, ఇన్‌చార్జ్ పదవి ఎవరికి ఇచ్చినా కలిసికట్టుగా పని చేయడానికి మేమంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చుండ్రు వెంకన్నరాయ చౌదరి, బుంగా సింహాద్రి, కోటగిరి మహేంద్ర బాబు, గండి వెంకటేశ్వరరావు, గంటా వీరన్న చౌదరి, కాకార్ల బుజ్జిబాబుచౌదరి, చీపురుపల్లి జయేంద్రబాబు, మద్దూరి స్వామి, వెలుగుల లచ్చారావు, కంటే సత్తిబాబు, ఆట్ల గంగరాజు, చాట్ర ఇమ్మానుయేల్, రెడ్డి వీరవెంకటసత్యనారాయణ, యాసలపు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సైకిల్ బహూకరణ



కరప, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పేపకాయల యశ్వంత్ దుర్గాప్రసాద్‌కు దాత సాయంతో సైకిల్ బహూకరించినట్టు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తెలిపారు. బాగా చదువుకుంటానని, స్కూల్‌కు వెళ్లి వచ్చేందుకు ఒక సైకిల్ కావాలన్న ఆ విద్యార్థి కోరికను డాక్టర్ బి.శ్రీహరిబాబు దృష్టికి తీసుకెళ్లగా తక్షణం ఆయన స్పందించి రూ.6వేలు విలువ కలిగిన సైకిల్‌ను అందజేసినట్టు తాతీలు చెప్పారు.

7వ తరగతి విద్యార్థికి సైకిల్ బహూకరిస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

• డీఎంహెచ్‌వో కార్యాలయంలో స్వచ్ఛాంధ్రా- స్వర్ణాంధ్రా



డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న డీఐవో, సామర్లకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జీజీహెచ్(కాకినాడ)ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్రా-స్వర్ణాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆదేశాలతో డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో సంభవించే అనారోగ్య సమస్యలు, తగు జాగ్రత్తల గురించి సిబ్బందికి తెలియజేయడంతోపాటు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వ్యర్థాలను సేకరించి-వేస్ట్ కేంద్రాలకు తరలిస్తామన్నారు. ప్రతి నెలా మూడో శనివారం జరిగే స్వచ్ఛాంధ్రా- స్వర్ణాంధ్రా కార్యక్రమాలు గురించి సిబ్బందికి వివరించి తగు సూచనలు చేశారు. ముఖ్యంగా దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, రసాయనాలను డ్రైనేజ్‌లలో ఎప్పటికప్పుడు వెదజల్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే శానిటేషన్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రవి, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకేలో..

జేఎన్టీయూకే(ఆంధ్రజ్యోతి): వర్సిటీ ఆవరణలోని పరిసరాలను స్వచ్ఛాంధ్రా- స్వర్ణాంధ్రా కార్యక్రమంలో భాగంగా యూసీఈకే, జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో శనివారం పరిశుభ్రం చేశారు. విద్యార్థులకు, అధ్యాపకులకు స్వచ్ఛాంధ్రా- స్వర్ణాంధ్రా లక్ష్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

పిఠాపురం(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రతపై శ్రద్ధ వహించాలని విరవాడ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎం.షెహజాద్ ఆలీ సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు గురించి వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, వైస్‌ప్రిన్సిపాల్ ఉషశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణప్రసాద్‌పాల్గొన్నారు.



వర్సిటీ ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

మొక్కలు నాటిన ఓఎస్‌డీ వెంకటకృష్ణ

సామర్లకోట(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛస్వర్ణ- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సామర్లకోట విస్తరణ శిక్షణాకేంద్రం ఆవరణలో నూతన ఎంపీడీవోలతో కలిసి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఓఎస్‌డీ వెంకటకృష్ణ మొక్కలు నాటారు. ఈటీసీ ప్రిన్సి పాల్ కెవెన్వీప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈటీసీ ఆవరణలో గ్రీనరీని చూసి ఓఎస్‌డీ అభి నందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ జీ.రమణ, ఎంపీడీవో శేషుబాబు తదితర ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రతీ విద్యార్థి మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పరిసరాల పరిశుభ్రతకు శ్రద్ధ చూపాలని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం పాఠశాల విద్యార్థులచే స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

వ్యాధులు రాకుండా చూడాలి

కరప(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకటశ్రీనివాస్ సూచించారు. కరపలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన సిబ్బందికి పలు సూచనలు జారీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, డ్రైన్‌లలో క్రమం తప్పకుండా సిల్ట్ తొలగించి మురుగు పారేలా చూడాలన్నారు. నిల్వ నీటిలో యాంటీ లార్వా, ఫాగింగ్ వంటి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నీటి కుంటల్లో కెమికల్ స్ప్రేయింగ్ చేయించారు. ముందుగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మాన్‌సూన్ హైజీన్ అనే నినాదంతో ప్రతిజ్ఞ చేసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి, జనసేన నాయకుడు బోగిరెడ్డి గంగాధర్, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు పరిహారం అందించాలి

• చంద్రబాబుని కలిసిన మాజీ ఎమ్మెల్యే వర్మ, మత్స్యకార నాయకులు



సీఎం చంద్రబాబునాయుడిని కలిసి మత్స్యకార సమస్యలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, మత్స్యకార నాయకులు

పిఠాపురం/యు.కొత్తపల్లి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్, ఓఎన్జీసీ డ్రిల్లింగ్ కార్యకలాపాలవలన సముద్రంలో మత్స్యసంపదకు నష్టం వాటిల్లి పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట తదితర తీర ప్రాంత మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని మత్స్యకార సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వారంతా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిసి తమ సమస్యలపై విన్నవించారు. కాకినాడ, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల మత్స్యకారులకు ఇచ్చిన మాదిరిగా పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న 2500 బోట్లుకు పరిహారం అందించాలని వారు కోరారు. అరబిందో, దివీస్ పరిశ్రమల నుంచి కాలుష్యంతో కూడా నష్టం జరుగుతోందని తెలిపారు. ఉప్పాడ వద్ద రక్షణగోడ నిర్మాణానికి నిధులు మంజూరుకు కేంద్రంతో మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా కోనపాపపేట ప్రాంతంలో రక్షణగోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప్పాడ హార్బర్ వద్ద నిర్మాణంలో లోపాలతో సుముద్రంలోకి వెళ్లి వచ్చే బోట్లు ప్రమాదానికి గురై ఆరుగురు మత్స్యకారులు చనిపోయారని తెలిపారు. ఈలోపాల సవరించడానికి, బోట్లు లోపలకు వచ్చే మార్గా లు వెడల్పు చేయడానికి రూ.30కోట్లు వ్యయం అవుతుందని ఆర్అండ్‌బీ శాఖా మంత్రి జనార్దనరెడ్డి తెలిపారని, ఆ నిధులు మంజూరు చేయాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వహయాంలో కొత్తపల్లి మండలంలోని మత్స్యకారులు విశాఖతోపాటు రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా వేటకు వెళ్లే అవకాశం ఉండేదని, వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేశారని వర్మ, నాయకులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలన్నింటిపై సీఎం సానుకూలంగా స్పందించారని వర్మ తెలిపారు.

ప్రజలకు చేరువగా పంచాయతీరాజ్ వ్యవస్థ

• డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సామర్లకోట ఈటీసీ నుంచి ప్రసంగిస్తున్న ఓఎస్‌డీ

సామర్లకోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖను ప్రజలకు మరింత చేరువగా, పారదర్శకంగా మార్చాలన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషికి అనుగుణంగా ఉద్యోగులంతా పనిచే యాలని ప్రత్యేకాధికారి(ఓఎస్‌డీ) కె.వెంకటకృష్ణ పిలుపునిచ్చారు. సామర్లకోట, బాపట్ల, శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణా కేంద్రాలలో ఒకనెల ప్రాథమిక శిక్షణ పొదుతున్న నూతన ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర సాయిలో అమలుచేసి గ్రామాలు, మండలాల పాలనలో మార్పులు తీసుకురావడంద్వారా ప్రజల అభివృద్ధి, ఉద్యో గ సంతృప్తి వస్తాయని సూచించారు. స్వర్ణ పంచాయతీ, మేరీ పంచాయతీ యాప్‌లద్వారా పంచాయతీ రాబడి, ఖర్చులను సైతం ప్రజలు నేరుగా తెలుసుకోవచ్చన్నారు. పంచాయతీ సంస్థలను ప్రజలకు అందుబాటులో ఉంచి వారి అభివృద్ధి, సంక్షేమంకోసం మెరుగుపడేలా సంస్కరణలు తీసుకువ స్తున్నామని ఓఎస్‌డీ వెంకటకృష్ణ వివరిం చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని లక్షా 30 వేల మంది ఉద్యోగులు, మరో లక్షా 30వేల మంది ప్రజాప్రతి నిధులకు సామర్థ్య పెంపులో భాగంగా ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాల న్నారు. మూడు శిక్షణా కేంద్రాలలో నూతన ఎంపీడీవోల తొలి బ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రిన్సిపల్స్ అధ్యాపకు లను ఓఎస్‌డీ వెంకటకృష్ణ అభినందిం చారు. సామర్లకోట శిక్షణాకేంద్ర ప్రిన్సిపాల్ కెవెన్వీ. ప్రసాదరావు, ఉప ప్రిన్సిపాల్ జీ.రమణ, ఫ్యాకల్టీ శేషుబాబు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు మెరుగైన విద్య: ఎమ్మెల్యే నానాజీ



విద్యార్థులకు నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, ఐటీఐ ప్రిన్సిపాల్ వర్మ

సర్పవరంజంక్షన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యార్జనతో ఉద్యోగ భద్రత లభి స్తుందని, మెరుగైన సాంకేతిక విద్యనందిం చడ మే కాకుండా విద్యార్థులకు ఉద్యోగాలు లభించేలా ఐటీఐ ప్రిన్సిపాల్ వర్మ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. శనివారం గొడారిగుంటలో క్యాంపు కార్యాలయంలో కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ వర్మ ఆధ్వర్యంలో వివిధ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన 20మంది విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసి, మెమొంటోలు అందించి అభినందించారు.

తిమ్మాపురం-4 వీవోఏగా దేవిని కొనసాగించాలి

సర్పవరంజంక్షన్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): గ్రామ సంఘం తీర్మానం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నియమించిన వీవోఏ దీనాకుమారిని తొలగించి, గ్రామ సంఘం తీర్మానంతో సభ్యులు నియమించు కున్న సైనబరపు దేవిని తిమ్మాపురం-4 వీవోఏగా కొనసాగించా లని మహిళా సంఘాల సభ్యులు డిమా ండ్ చేశారు. శనివారం తిమ్మాపురం శివారు అవంతి నగర్, పేటకాలువగట్టు దుర్గాదేవి ఆలయంవద్ద సూర్యతేజ గ్రామ సంఘం అధ్యక్షురాలు పి.వరలక్ష్మి ఆధ్వర్యంలో వెలుగు అధికారుల వైఖరికి నిరసనగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సంఘం ప్రతినిధులు వరలక్ష్మి, సూరంపూడి దుర్గ, జ్యోతి, టి.వరలక్ష్మిలు మాట్లాడుతూ గతంలో ఇక్కడ యానిమేటర్‌గా పనిచేసిన మనబ్రోలు కనక దుర్గ వ్యక్తిగత కారణాలతో మానేసిందన్నారు. ఈమె స్థానంలో విద్యాధికురాలు స్థానిక గ్రూపు సభ్యురాలైన సైనబరపు దేవిని వీవోఏగా మే 9న గ్రామసంఘం ఓబీల సమక్షంలో ఓబీలు, ఈసీ సభ్యుల తీర్మానంతో నియమించినట్లు చెప్పారు. ఈమెకు వెలుగు ఏపీఎం, సీసీ శిక్షణ ఇచ్చి వీవోఏగా నియమించామన్నారు. రాజకీయ నాయ కుల ఒత్తిళ్లతో దేవి స్థానంలో 31 సంఘాలు కలిపి ఉన్న సూర్యతేజ గ్రామ సంఘం సభ్యుల తీర్మానం లేకుండా, వెలుగు అధికారులు ఏకపక్షంగా నిబంధనలు ఉల్లంఘించి వీవోఏగా దీనాకుమారిని నియమించారని ఆందో ళన వ్యక్తం చేశారు. ఈవిషయమై జిల్లా అధికారులు విచారణ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన అధికా రులపై చర్యలు తీసుకుని, దేవిని వీవోఏగా తిరిగి నియ మించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 18 డ్వాక్రా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పిఠాపురంలో హనుమాన్‌చాలీసా పారాయణం

• భారీగా తరలివచ్చిన భక్తులు



పారాయణం చేస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామి

పిఠాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణం అగ్రహారంలోని శ్రీపాదవల్లభ అనఘా దత్త క్షేత్రంలో శనివారం సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణం జరిగింది. కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి తరలివచ్చిన భక్తులు చాలీసా పారాయణం చేశారు. దత్తక్షేత్రంలో చాతుర్మాస్య వ్రత దీక్షలో ఉన్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. ఆలయ పరిసరాలు హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి.

వినాయక మట్టి విగ్రహాల పంపిణీ

పిఠాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంవద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ప్రజలకు 1008 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి గణనాథులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. మండల ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షు డు రేపాక రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కాకినాడజిల్లా ఉపాధ్యక్షుడు వెలగా వెంకట నగేష్, కాకినాడ జోన్ ఛైర్‌పర్సన్ ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, జిల్లా కన్వీనర్ బోడా సతీష్, రేపాక రమేష్, దత్తు, చెక్క శోభనాద్రి, వెంకట్, నడిపల్లి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో రక్తదాన శిబిరం

• జీజీహెచ్‌కు 65యూనిట్ల రక్తాన్ని అందించిన ఆదిత్య విద్యార్థులు

కాకినాడరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కాకినా డ లక్ష్మీనారాయణనగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఈ శిబిరంను ఆత్మీయ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శిరంగు దొరబాబు, కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ వైద్యుడు అనిల్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. సుమారు 65 మంది విద్యార్థులు జీజీహెచ్‌కు 65 యూనిట్ల రక్తాన్ని అందజేసినట్లు కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీయివీఎల్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.తేజేశ్వరరావు, డి.అశ్విని పాల్గొన్నారు.

అదాని విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి

• ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు

కాకినాడ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):రైతులు, వ్యవసాయ కార్మికులు, పారిశ్రామిక కార్మికులు, స్కీం వర్కర్లు, ఇతర వర్గాలు అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని స్థానిక కచేరీపేట సీఐటీయూ కార్యాలయంలో శనివారం దువ్వా శేషుబాబ్జి అధ్యక్షతన జరిగిన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో పలు సంఘాల నా యకులు పప్పు ఆదినారాయణ, గుబ్బల ఆదినారాయణ, కెఎస్ శ్రీనివాస్, వల్లూరి రాజబాబు, గొడుగు సత్యనారా యణ, రాఘవులు ప్రసంగించారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన విద్యుత్ ఛార్జీల తగ్గింపు హామీకి భిన్నంగా ప్రీ పెయిడ్ స్మార్ట్‌మీటర్ల బిగింపును ఉపసం హరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎవరైనా ఆదాని మీటర్లు వేయించుకోమని అడిగితే ప్రజలు వద్దని చెప్పాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చెక్కల రాజ్‌కుమార్, టి.రాజా, జి.చిట్టిబాబు, భవాని పాల్గొన్నారు.

శ్రీపాదవల్లభుడికి లక్ష తులసి అర్చన



పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభులకు లక్ష తులసి అర్చన నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం లక్ష తులసి అర్చన నిర్వహించా రు. వేద పండితులు, రుత్విక్కులు తులసి దళాలతో అర్చన చేశారు. శ్రీపాదవల్లభుడు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతులను విశేషంగా అలంకరించారు. అనంతరం మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, సర్వపుష్ప పూజ, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, వేదపారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్ఠానము, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. శ్రీపాదవల్లభ మహాసంస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణంతో బహుళ ప్రయోజనాలు

• రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ హనుమంతరావు

కాకినాడసిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో మారుతున్న సాంకేతికతతో గ్రీన్ బిల్డింగ్స్ నిర్మాణంద్వారా బహుళ ప్రయోజనాలు అందించే ఆస్కారం ఉందని కేంద్ర ప్రభుత్వ సిమెంట్ అండ్ కాంక్రీట్ నేషనల్ కమిటీ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎంఎస్ రోటరీ సర్వీస్ సెంటర్‌లో కాకినాడ రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపినాధ్ అధ్యక్షతన క్లబ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇంపాక్ట్ ఆఫ్ గ్రీన్ బిల్డింగ్స్ అనే అంశంపై డాక్టర్ హనుమంతరావు ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు సహజ వనరుల పరిరక్షణకు గ్రీన్ బిల్డింగ్స్ ఆవశ్యకత ఎంతో అవసరమన్నారు. ఈ నిర్మాణాలవల్ల విద్యుత్ ఆదా, నీరు పొదుపుతోపాటు వాతావరణ కాలుష్యం తగ్గించవచ్చ న్నారు. భవిష్యత్‌లో ఈ నిర్మాణ సాంకేతికత ఎంతో ఉప యోగపడుతుందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో భూకంపం సంభవించి ఆస్తి, ప్రాణ నష్టం కలిగినప్పుడు అక్కడి ప్రభుత్వం సంప్రదించడంతో గ్రీన్ బిల్డింగ్ ఎన్విరాన్‌మెంట్ పరిజ్ఞానా న్ని ఉపయోగించి రెండులక్షల గృహ సముదాయాలను అద్భుతంగా నిర్మించామన్నారు. రానున్న తరానికి నేటి నిర్మాణాలతో మోయలేని భారం పడుతుందన్నారు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రీన్ బిల్డింగ్స్ వైపు దృష్టి మళ్లిస్తే ఆరోగ్యంతో పాటు ఆదా కూడా చేయవచ్చని వివరించారు. అనంతరం డాక్టర్ హనుమంతరావును క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపినాద్ ఆధ్వర్యంలో సత్క రించారు. ఈ సమావేశంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సాన, కోశాధికారి ఉదయచక్రవర్తి, గోవిందరాజులు, లంక సాయిబాబు, టీఎస్ఎన్ రాజు, సత్తి రవిరెడ్డి, భూపేంద్ర, పద్దరాజు, నెక్క ంటి శ్రీనివాస్, మాచారెడ్డి, నేతి నాగేశ్వ రరావు, చెలికాని సూర్యారావు పాల్గొన్నారు.

సీఎంకు నాయకుల ఘనస్వాగతం





కాకినాడ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు హెలిప్యాడ్‌వద్ద కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వాగతం పలికారు. ఆయనతోపాటు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ఉన్నారు. కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని కూడా సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా అందజేశారు.

పీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారుడికి వైద్య సాయం కోసం మంజూరైన పీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కాకినాడలో శనివారం అందజేశారు. గండేపల్లికి చెందిన కటకం వెంకటరమణ హెర్నియా, హిమోఫిలియా వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వెల్లూరులో సీఎంసీ ఆస్పత్రిలో చేరగా వైద్యానికి రూ.6లక్షలు ఖర్చవుతుందన్నారు. ఈ నేపథ్యంలో సాయం కోసం కాకినాడ ఎంపీని సంప్రదించగా వెంటనే స్పందించిన ఆయన ఆర్థికసాయంకోసం పీఎం రిలీఫ్ ఫండ్‌కు లేఖ రాయగా రూ.6లక్షలు విడుదల చేశారు. ఎంపీకి వెంకటరమణ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

అన్నవరం సత్యదేవ కళాశాలలో అడ్మిషన్లు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలో ఉన్న అన్నవరం సత్యదేవ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. బీఏ స్పెషల్ తెలుగు, బీకామ్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ అండ్‌ఇన్సూరెన్స్, బీఎస్సీ ఆక్వాకల్చర్, బీఎస్సీ హోమ్‌సైన్సు, బీకామ్ జనరల్, కంప్యూటర్ అప్లికేషన్లు వంటి కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని వెల్లడించారు. వివరాలకు విద్యార్థినులు కళాశాలలో సంప్రదించాలన్నారు.

'పాదగయ' సంఘటనలపై విచారణ జరపాలి

పిఠాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మి వ్రతాల నిర్వహణ సమయంలో జరిగిన సంఘటనలపై విచారణ జరపాలని విశ్వ హైందవ పరిషత్ రాష్ట్రఅధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన శనివారం తెలిపారు. వరలక్ష్మీ వ్రతాల టిక్కెట్లు సమయంలో తోపులాట జరిగి ఒక మహిళా భక్తురాలు గాయపడడం, ప్రసాదాల పంపిణీ సమయంలో సిబ్బంది పులిహోరను విసిరికొట్టడంతోపాటు భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించడం గర్హణీయమన్నారు. హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్‌పై సీఎం అసహనం

పెద్దాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్‌పై ఎంతమేర ప్రజలకు అవగాహన ఉందనే విషయంపై సభా ప్రాంగణంవద్ద మహిళలను చంద్రబాబు అడిగారు. ఎంతమందికి తెలుసని ప్రశ్నించి ఎంతమందికి తెలియదో వారు చేతులు పైకి ఎత్తాలన్నారు. దీంతో చాలామంది తెలియదని చేతులు పైకి ఎత్తడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిపై సీఎం ఒకింత అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే వాట్సాప్ గవర్నెన్స్‌పై సచివాలయ సిబ్బందితో అవగాహన కల్పించాలన్నారు. దీనిపై శ్రద్ధపెట్టాలన్నారు.

వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్

పిఠాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని మునిసిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం ప్రత్యేక వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించారు. 5-7 ఏళ్ల పిల్లలకు డీపీటీ 2వ బూస్టర్ డోస్, 10,16 సంవత్సరాల విద్యార్థులకు టీడీ డోస్ అందించారు. కార్యక్రమంలో ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జయరాం, పాఠశాల హెచ్ఎం కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం కౌన్సిల్ సమావేశం వాయిదా

ఏలేశ్వరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో చైర్‌పర్సన్ సమావేశాన్ని వచ్చేనెలకు వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. కౌన్సిలర్లు బదిరెడ్డి గోవింద్, సామంతుల హైమావతి, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

వాహనాల తనిఖీ


ఇందుకూరు గ్రామ సమీపంలో వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

దేవిపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందుకూరు గ్రామ సమీపంలో ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహించారు. గోకవరం నుంచి ఇందుకూరుపేట మీదుగా పోతవరం వరకు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


శ్రీరామగిరి ప్రధాన రహదారిపై వరదనీరు

నాలుగు రోజులుగా జలదిగ్బంధంలోనే గ్రామాలు

వీఆర్‌పురం అగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల కారణంగా మండలంలోని ఆయా గ్రామాలు నాలుగు రోజులుగా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. నాలుగు రోజులుగా శ్రీరామగిరి, సీతంపేట గ్రామాల మధ్యలోని ప్రధాన రహదారిపైన, చింతరేవుపల్లి, కన్నాయిగూడెం గ్రామాల రహదారులపై వరదనీరు ఉండటంతో రైతులు ఎరువులు తీసుకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. త్వరగా పోలవరం ప్యాకేజీ ఇస్తే వెళ్లిపోతామంటున్నారు.


స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, టీడీపీ నాయకులు

చింతూరులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

చింతూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఎస్టీ కాలనీ, పోలీసు స్టేషను ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎస్టీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుల్లయ్య, ఎంపీడీవో శ్రీనివాసు దొర, ఈవోపీఆర్‌డీ జీ.మోహనరావు, సీడీపీఓ విజయలక్ష్మి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు జమాల్‌ఖాన్, మాజీ మండల అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, ఆసిఫ్, ఓబులునేని నరసింహారావు, బీజేపీ నాయకుడు డీవీఎస్ రమణారెడ్డి, జనసేన నాయకుడు మడివి రాజు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. పోలీసు స్టేషను ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు అధికారులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


టార్పాలిన్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

వీఆర్‌పురం, అగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, టార్పాలిన్‌లను వరద బాధితులకు పంపిణీ చేశారు. గోదావరి వరదల కారణంగా మూడు రోజులుగా రేఖపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వరద బాధితులకు శనివారం ప్రభుత్వం నుంచి వచ్చిన నిత్యావసర సరుకులతో పాటు, ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు ఆధ్వర్యంలో టార్పాలిన్లు, దోమతెరలు, సరుకులను ఎంపీపీ కారం లక్ష్మి, తహశీల్దార్ సరస్వతి, ఎంపీడీవో జాన్‌వెస్లీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్ పురం వీఆర్‌వో గంగాభవాని, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, ఏఎస్‌డీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి


కుంజా శ్రీను

రంపచోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలు పెట్రేగిపోతున్నాయని, రెవెన్యూ, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. రంపచోడవరం మెయిన్ రోడ్డులో బహుళ అంతస్తుల నిర్మాణం జరుగుతుందని దీనిపై అధికారులు తక్షణమే స్పందించి కూల్చి వేయాలన్నారు. అక్రమ కట్టడాలపై చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులపై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎన్‌ఐటీలో ఆదివాసీ విద్యార్థినికి సీటు

చింతూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన ఆదివాసీ విద్యార్థిని తిమ్మ సుమనస్వి ఎన్ఐటీ అగర్తలలో బీటెక్ ఈసీఈ సీటు సాధించింది. ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో ఓపెన్ ర్యాంక్ 2,42,664 సాధించగా ఎస్టీ కేటగిరి ర్యాంక్ 3259 సాధించింది. దీంతో తొలి విడతలో ఎన్ఐటీ అగర్తలలో సీటు రావడంతో చేరారు. ఆమెకు సీటు రావడంపై ఆదివాసీ సంఘాల నాయకులు, స్థానికులు అభినందనలు తెలిపారు. ఆమె తండ్రి తొమ్మసాయి అటవీ శాఖ సెక్షన్ అధికారిగా, తల్లి లలిత ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

బీజేపీ నాయకుడికి పలువురు పరామర్శ

దేవీపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం మండలం ఏనుగులగూడెం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు తురస సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇందుకూరు వన్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఆయన్ను మండల కూటమి నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్టి వెంకటేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు కారం రామన్నదొర, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అయినాల శ్రీను, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి తదితరులు ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రమాదం.. పట్టించుకోరా?

పొలంలో పడిపోయేలా ఉన్న విద్యుత్ స్తంభం

ఆందోళనలో రైతులు

రౌతులపూడి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడజాం గ్రామశివారు పొలంలో విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా ఉంది. ఓ పక్కకు వాలి ఏ క్షణమైన పడిపోయేలాఉంది. దీంతో రైతులు పొలం పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులు చేసుకునే సమయంలో స్తంభం పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున విద్యుత్‌శాఖాధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.


గిడజాం గ్రామశివారు పొలంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

రహదారి నిర్మాణానికి చర్యలు


ఏలేశ్వరంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జె.అన్నవరం రహదారి పునఃనిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ బుజ్జి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అధికారులను ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై ఆరా తీశారు. వ్యవసాయానికి యూరియా ఎంతో అవసరమని 2,3 రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. పెద్దనాపల్లిలో విద్యుత్ లోవోల్టేజ్, తాగునీటి ట్యాంకు సమస్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. రమణయ్యపేట నుంచి జె. అన్నవరం రహదారి పునఃనిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తమ అవార్డు గ్రహీతలు అవసరాల కిషోర్, సత్యనారాయణ, మణికంఠ తదితరులకు శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. ఎంపీడీవో సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

కోనేరు అభివృద్ధికి నివేదిక


కోనేరును పరిశీలిస్తున్న అధికారులు

గండేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గండేపల్లిలో కోనేరు అభివృద్ధి చేయడానికి నివేదిక పంపిస్తామని ఎంపీడీవో చంద్రరావు అన్నారు. శనివారం గండేపల్లి ఉపాధి హామీ పథకం పల్లె పుష్కరిణిలో భగంగా కోనేరును పరిశీలించారు. ఉప్పలపాడు, తాళ్లూరుల్లో కోనేరు అభివృద్ధికి నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు.

'ఆదిత్య'లో అంతరిక్ష దినోత్సవం

గండేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నందు ఇనిస్టిట్యూట్ అఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ఐఈ టీఈ) స్టూడెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీ, పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

'బస్సు సౌకర్యం కల్పించాలి'

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లికి బస్సు సౌకర్యం లేక దూరప్రాంతాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి వినతి అందజేశారు. బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జీను మణిబాబుకు సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో జగ్గంపేట మండలాధ్యక్షుడు జీను మణిబాబుని పల్లపుట వీధి రైతు కూలీ సంఘం అధ్యక్షుడు బండారు నాని ఆధ్వర్యంలో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. గొల్లలగుంట టీడీపీ నాయకులు తిరుమల రాజు మురళీరాజు, చిత్రపు బాబు, శేఖర్‌రాజు, కృష్ణంరాజులు సత్కరించారు. జగ్గంపేట మండలం వెంగయమ్మపేరం టీడీపీ నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


జీను మణిబాబును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి


ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛంధ్ర ర్యాలీ

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని ధర్మవరం సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మవరం పంచాయతీ వద్ద శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛంధ్ర ర్యాలీని వారు పారంభించి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల అంటు వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చన్నారు. డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాధ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బలక్ష్మి, కార్యదర్శి చెల్లుబోయిన వేణుగోపాల్, పీఏసీఎస్ అధ్యక్షులు దాసం శేషారావు కూటమి నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

జగ్గంపేటలో...

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు, జ్వరాలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. రాజపూడి పీహెచ్‌సీ ఏఎన్ఎం కె.పండమ్మ, ప్రిన్సిపాల్ చెన్నారావు పాల్గొన్నారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

'అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించరా'


ప్రత్తిపాడు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధాకర్

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులను ఆహ్వానించకుండా ప్రోటోకాల్ పాటించకుండా చేస్తున్నారని మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చినశంకర్లపూడి, శరభవరం, ఎంపీటీసీలు పిల్లా కొండలరావు, అమరాది కాశీ జగన్నాధం గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రోటోకాల్ విస్మరిస్తున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీపీ సుధాకర్, ఎంపీడీవో కుమార్‌బాబు ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ఆహ్వానించాలని ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో డీఆర్‌జేఈ సత్యప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బలక్ష్మి, ఏపీవో కుమార్ స్వామి ప్రసంగించారు. ధర్మవరం ఎంపీటీసీ జువ్వల సుజాత బాబులు ధర్మవరం బైపాస్ రహదారిలోని శ్మశాన వాటికకు ప్రహరీగోడ నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఒమ్మంగి సొసైటీ అధ్యక్షుడు సత్యంశెట్టి సతీరాం, సర్పంచ్‌లు నడిగట్ల త్రిమూర్తులు, రొంగల నాగేశ్వరరావు, గొనగాల అప్పలరాజు, తటవర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, నెహ్రూ చిత్రపటాలకు పాలాభిషేకం


రాజపూడిలో చంద్రబాబు, నెహ్రూ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు

జగ్గంపేట రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజపూడిలో రైతులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇటీవల క్యాబినెట్ మీటింగ్‌లో తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పుష్కర కాలువకు రూ.51.67కోట్లు మంజూరు చేయడంతో మెట్ట రైతులకు ఇది వరమని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టు కుందని ఆనందం వ్యక్తం చేశారు. జ్యోతుల నెహ్రూ ఎన్నికల వాగ్దానాల్లో మొట్టమొదటిగా పుష్కర కాలువ ద్వారా నీటిని రైతులకు అందిస్తానని హామీ ఇచ్చారు. హామీని నెరవేర్చడంతో ముఖ్యమంత్రి, నెహ్రూ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించామని తెలిపారు.


ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆశీర్వచనాలు అందజేస్తున్న పండితులు

లోవలో ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ పూజలు

తునిరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్లు రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీకాంత్ లాల్ దండే సతీసమేతంగా లోవ తలుపులమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పండితులు వేద ఆశీర్వచనం గావించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

కషాయాలతో చీడపీడల నివారణ

శంఖవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ కషాయాలతో చీడపీడలను నివారించవచ్చునని వ్యవసాయాధికారి పి. గాంధీ అన్నారు. శనివారం శంఖవరంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

తునిరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వప్న అన్నారు. శని వారం ఏరియా ఆసుపత్రిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని వైద్యులు సిబ్బంది తో కలిసి నిర్వహించారు. ఏరియా ఆసుపత్రిలో డ్రైన్లు శుభ్రం చేసి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

శంఖవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచడంపై ఎంపీడీవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శంఖవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి అప్పలరాజు, ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, దేవుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు

తొండంగి, ఆగష్టు 23 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ, ర్యాలీలు నిర్వహించారు. బెండపూడిలో కార్యదర్శి రాజబాబు, ఈవో ఆర్డీ ప్రేమ్ కుమార్‌ల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థుల ప్రతిభ

తొండంగి, (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆవులమంద నుంచి ఇద్దరు సెకండరీ గ్రేడ్ పోస్టుకు, ఏ.కొత్తపల్లి నుంచి సోషల్ అసిస్టెంట్‌గా ఒకరు, హుకుంపేట కు చెందిన ఒకరు, కోదాడ గ్రామం నుంచి మరొకరు ఎంపిక య్యారు. వేమవరం గ్రామానికి చెందిన యనమల పంప ప్రసాద్ ఫిజికల్ సైన్స్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించారు. ఈయన తుని సచివాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఇదే విభాగంలో గొర్సపాలెం గ్రామానికి చెందిన మనిమెల గోవిందు పదో ర్యాంకు సాధించారు.

సీఎం చంద్రబాబును కలిసిన నెహ్రూ, నవీన్


సీఎం చంద్రబాబుతో నెహ్రూ, నవీన్

జగ్గంపేట, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): పెద్దాపురం పర్యాటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కలిశారు. పుష్కర అంతర్భాగం తాళ్లూరు లిఫ్టుకు రూ.52 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఆటో డ్రైవర్లకు బియ్యం పంపిణీ చేసినందుకు వారిని అభినందించారు.

సీఎం చంద్రబాబుకు అన్నవరం ప్రసాదం అందజేత


ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు అన్నవరం సత్యదేవుడి ప్రసాదాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ అందజేశారు. పెద్దాపురం పర్యటకు వచ్చిన సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే సత్యప్రభ మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. పెద్దాపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు.

సీఎంతో యనమల భేటీ


సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తునిరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి చంద్రబాబుతో కొద్దిసేపు ముచ్చటించారు.

ఎమ్మెల్యే దివ్య స్వాగతం


సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే దివ్య

తుని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని సీఎం చంద్రబాబుని తుని ఎమ్మెల్యే యనమల దివ్య కోరారు. పెద్దాపురం విచ్చేసిన ముఖ్యమంత్రికి హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికి జ్ఞాపిక అందజేశారు. అభివృద్ధి పనులకు సంబంధించి వినతి అందజేశారు.

పీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారునికి వైద్య సాయం కోసం మంజూరైన పీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ శనివారం కాకినాడలో అందజేశారు. గండేపల్లికి చెందిన కటకం వెంకటరమణ హెర్నియా, హిమోఫిలియా వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వెల్లూరులో సీఎంసీ ఆసుపత్రిలో చేరగా వైద్యానికి రూ.6లక్షలు ఖర్చు అవుతుందన్నారు. సాయం కోసం కాకినాడ ఎంపీను సంప్రదించగా ఆయన పీఎం రిలీఫ్ ఫండ్‌కు లేఖ రాయగా రూ.6లక్షలు విడుదల చేశారు. ఈసందర్భంగా వెంకటరమణ కుటుంబసభ్యులు కాకినాడఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.